# మనసుతోటి ఆడకు రచయితా!

ఉత్తరం రాయడం పూర్తిచేసి కవరునంటించి పనిమనిషికిచ్చి పోస్టు చేసిరమ్మని పంపించింది శిరీష.

"హమ్మయ్య అయిందా తల్లీ! ఇప్పటికైనా స్నానం చేసొస్తావా టిఫిన్ తిందువుగాని" అంది సుహాసిని పది గంటలవుతున్నా నైట్ గౌన్‌లో వున్న కూతుర్ని చూసి.

"వన్ మినిట్‌లో రెడీ అవుతా! హాలీడేస్ కద మమ్మీ! ఇప్పుడు కూడా బైంకి తయారయిపోయి ఏం చెయ్యాలి? బోర్ కొడుతుంది" అంది ఒళ్లు విరుచుకుంటూ. మమ్మీ! నేను అర్జంటుగా బయటికెళ్లాలి! ఒక గంటా రెండు గంటల్లో ఒచ్చేస్తాను" అంది.

"వెళ్ళు! అది మామూలేగా! సెలవులొస్తే కాకుల్లా తిరగడమే పని!" అంటూ ఏదో పనిలో పడిపోయింది ఆమె.

శిరీష హుషారుగా ముస్తాబై బయలుదేరింది.

* * *

తను డైరీలో రాసుకున్న చిరునామాని వెతుక్కుంటూ 'బంజారాహిల్స్'కి వెళ్లింది. ఉదయం తను చదివిన నవలలో ఎంత బాగా రాశాడీ రచయిత! అక్కా తమ్ముళ్ల అనుబంధాన్ని పంచదార చిలకలకన్నా తియ్యగా వివరించాడు! అక్కయ్య పిల్లల మీద ఆపేక్ష పాయసం తాగుతూన్నంత మధురంగా వర్ణించాడు. ఒక దివ్యమైన అనుభూతిని ఊహించుకుంటూ ఆ రచయితతో సంప్రదించి తన సందేహాలు తీర్చుకుని తృప్తిపడాలని బయలుదేరింది శిరీష!

గేటు ముందు బోర్డుచూసి ఆటోని అక్కడ ఆపమంది. మెల్లగా గేటు తోసుకుని లోపలికెళ్లింది బిక్కు బిక్కుమంటూ!

పది గజాలు వెళ్ళేసరికి అడుగు ముందుకుపడక అక్కడే ఆగిపోయింది.

"ఒరేయ్ తమ్ముడూ! ఆపదలో ఆదుకోమని అర్థించడానికొచ్చిన అక్కయ్యని అవమానించి పంపించడం నీకు ధర్మం కాదు ఏడుస్తోంది ఆమె!

"ఈ రోజు నుంచీ నీకూ నాకు ఏ రకమైన సంబంధమూ లేదు. నేను నీకు తమ్ముణ్ణి కాను, నువ్వు నాకు అక్కవి కావు" విసురుగా వుంది అతని కంఠం! భయంకరమైన పిడుగులా వుంది అతని అరుపు.

ఆమె ఆరున్నర శృతిలో ఏడుపు!

"ఒసేవ్ కాంతం! దొంగముండా! ఎక్కడ చచ్చేవ్! నువ్వు పెళ్లానివా పిశాచానివా! పిలుస్తే పలకవేం?" అదే స్వరం.

శిరీషకి అంతా అర్థమై పోయింది. అర సెకండు కూడా అక్కడ వుండబుద్ధి కాలేదు. గిరుక్కున వెనక్కి తిరిగింది! ఆమె మనసు విరిగిన పాలులా గజిబిజిగా వుంది.

"అంతా నాటకం! అబద్ధం! తియ్యగా రాసేవారి కలం వెనుక ఇంత చేదుగా వుండే మనసుంటుందా? మనసుకీ మాటకీ అసలు పొంతనే లేదా? ఎందుకీ ఆత్మవంచన? ఏమిటీ మేడిపండు జీవితాలు?" ఆ చిన్ని మనసు విలవిలలాడిపోయింది!

అంతలోనే ఆ రచయిత మీద సానుభూతి కూడా కలిగింది. "ఒకవేళ నిజ జీవితంలో తాను పొందలేని దాన్ని పొందినట్టుగా ఊహించుకుని ఆ తృప్తితో ఆనందంగా వుంటున్నాడేమో? ఏమో? ఏమో?...?" సమాధానం దొరకని ప్రశ్నలతో బుర్ర వేడెక్కిపోతూ వుంటే తిరుగు ముఖం పట్టింది శిరీష!

ఆమె ఆలోచనలు జీవితాన్ని గురించి ప్రశ్నల వర్షం కురిపించాయి! ఆలూమగలూ, అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లు, స్నేహితులూ, బంధువులూ

అసలు ఎంతవరకీ సంబంధం? ఎంత దూరం వెళుతుందీ బంధం?" అయోమయంగా వుంది శిరీషకి! దూరంనుంచి కాఫీ హోటల్లో పెట్టిన రికార్డు ఒద్దన్నా వినిపిస్తోంది! 'మరు జన్మ వున్నదో లేదో? ఈ మమతలప్పుడేమవుతాయో? మనిషికి మనసే తీరని శిక్ష! దేముడిలా తీర్చుకున్నాడు కక్ష!' శిరీషకి ఏదో సమాధానం దొరికింది.

'మనిషికసలు మనసుండకూడదు. ఉంటే శిక్ష తప్పదు అని ఆ మాటే ఇంటికెళ్లాక తల్లితో అంది.

ఆమె ఉలిక్కి పడింది!

"మనసులేని మనిషి పాషాణంతో సమానం! బండరాయి కన్నా దండగైనది ఆ జీవితం!

మనసులేని మనసులోంచి పుడుతుంది భయంకరమైన ద్వేషాగ్ని! అది ఏ పేరుతోనైనా, ఏ 'ఇజ'మని అనుకున్నా యావత్ ప్రపంచాన్నీ దహించేదిగా వుండొచ్చు!

జీవితం తాత్కాలికం!

జీవనం శాశ్వతం!

అది కొనసాగుతూనే వుంటుంది, అంతు తెలియని కడలిలా!

తల్లి మాటలను జాగ్రత్తగా విన్న శిరీష తృప్తిగా నిట్టూర్చింది.

ఇప్పుడు శిరీషకి దిగులు లేదు!

బాధలేదు.

మంచిగా బతకాలన్న బాధ్యతొక్కటే ఆమె ధ్యేయం.

డ్రెస్సు మార్చుకుని 'నైటీ' వేసుకుని హాయిగా నిద్దబోయింది శిరీష 'మనసుతోటి ఆడకు రచయితా' అంటూ ఆ నవల పక్కన పడేసి! ★